



కరీంనగర్ బైపాస్ లో వెలగని స్ట్రీట్ లైట్లు



చీకటిగా ఉన్న విద్యానగర్

స్మార్ట్‌సిటీలో చిమ్మ చీకట్లు

- నాలుగు నెలలుగా వెలగని స్ట్రీట్ లైట్లు
- పట్టించుకోని అధికారులు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గతంలో నగరంలోని స్మార్ట్ రోడ్లన్నీ వెలుగులతో జిగేల్‌మనేవి. రోడ్డుకు ఇరువైపులా ఆకర్షణీయమైన వీధిదీపాలను ఏర్పాటు చేయడంతో కాలనీలు మెరిసిపోయాయి. ఒకప్పటి కరీంనగర్‌కు ఇప్పటి కరీంనగర్‌కు ఎంతో తేడా కనిపిస్తోందని నగరానికి వచ్చే వారు ఆశ్చర్యపోయేవారు. ఇప్పుడు అవే రోడ్లలో చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి. ఐదారు నెలలుగా స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ఏర్పాటు చేసిన వీధిదీపాలు చాలా చోట్ల చెడి పోయాయి. వాటిని పట్టించుకుని లైట్లను మార్చక పోవడంతో చీకటి రోడ్లను చూసి స్మార్ట్‌సిటీ హంగులు మూడునాళ్ల ముచ్చటేనా అంటూ ప్రజలు విమర్శిస్తున్నారు.

కనీస నిర్వహణ కరువు

కోట్ల రూపాయలతో నగరంలోని ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారులు మినహా మిగిలిన అంతర్గత రోడ్లను స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేశారు. హౌసింగ్ బోర్డుకాలనీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అందమైన లైట్లను బిగించారు. నాలుగైదు నెలలుగా అక్కడ లైట్లు వెలుగక పోవడంతో చీకట్లు అలుముకుంటున్నాయి. వాటికి కనీస నిర్వహణ లేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. కలెక్టరేట్ ముందు నుంచి వెళ్లే ప్రధాన రహదారిలో కూడా అక్కడక్కడ లైట్లు వెలగడం లేదు. వాటిని పట్టించుకునే వారే కనిపించడం లేదు. ఎంఆర్ గార్డెన్, ఎస్‌బీఎస్ రోడ్, శాతవాహన యూనివర్శిటి రోడ్, కోతిరాంపూర్, గాంధీరోడ్డు, ఇలా స్మార్ట్‌సిటీ రోడ్లలో రాత్రివేళల్లో వీధిదీపాలు వెలగడం లేదు. స్మార్ట్‌సిటీలో చీకట్లు కనిపించడం లేదా అంటూ ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. దాదాపు ఐదారు నెలల నుంచి స్మార్ట్‌సిటీ లైట్లు వెలుగడం లేదని స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో ఏర్పాటు చేసిన లైట్ల మరమ్మతులు, నిర్వహణ ఆ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ చేయాల్సి ఉంటుందని మున్సిపల్ ఎలక్ట్రికల్ విభాగం సిబ్బంది అంటున్నారు. కాంట్రాక్టర్ వీధి దీపాల నిర్వహణను గాలికి వదిలి వేశారని, ఆ లైట్లకు సంబంధించిన విడిబాగాలు తమ వద్ద లేవని చెబుతున్నారు.

ఇబ్బందుల్లో నగరవాసులు

నగరపాలక సంస్థకు సంబంధించిన వీధి దీపాలూ వెలుగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ఈ రోడ్ల నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ప్రజాప్రతినిధులు వెళ్తున్నారే కానీ వీధిదీపాలను పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రజాప్రతినిధులు కూడా కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన లైట్ల నిర్వహణను పూర్తిగా మరిచిపోయారని, కాంట్రాక్టర్‌తో ఎందుకు పనులు చేయించడం లేదని ప్రశ్నిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నగరంలోని వీధిదీపాలు వెలిగేలా చూడాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



హుజూరాబాద్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

హుజూరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు కె సత్యనారాయణరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలన్నారు. పదో తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శోభరాణి, పవన్, ఆసియా, పల్కల ఈశ్వర్‌రెడ్డి, రోజారాణి, అర్చన, స్వామిరావు, మారుతి, ప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులైన భాషాపండితులకు పదోన్నతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌యూపీపీటీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా

కరీంనగర్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): అర్హత కలిగిన భాషా పండితు లంద రికీ పదోన్నతులు కల్పిం చాలని ఆర్‌యూపీపీటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నగరంలో నిర్వహించిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. రాష్ట్రంలోని భాషా పండితులకు పదోన్నతులు కల్పించడంపై యూనియన్ పక్షాన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ, మిగిలిన పండితులందరికి వెంటనే పదోన్న తులు కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతి ప్రాథమిక పాఠశాలలో భాషా పండితులను నియమించాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి హామీ నిలబెట్టుకో వాలని అన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి నేపూరి కరుణా కర్, రాష్ట్ర సహాధ్యక్షుడు నాగుల భిక్షపతి, గౌరవ అధ్యక్షుడు పిస్నింటి బాల్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు కె స్వామి, ఎండీ ఉమర్‌అలీ, ఎండీ ఫాజిల్, జహంగీర్, మధుసూదన్ రెడ్డి, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజన బిల్లులు ప్రతీ నెల చెల్లించాలి'

కరీంనగర్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతీ నెలా బిల్లులు చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మాడుగుల పర్వతరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని టీఎన్‌జీవోస్ భవన్‌లో జరిగిన ఎస్టీయూ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన బియ్యం సరఫరా, వంట సామగ్రి, కిచెన్ షెడ్, నాణ్యమైన కూరగాయలు మధ్యాహ్న భోజన కార్మికులకు అందేలా ప్రత్యేకమైన వ్యవస్థను రూపొందించాలన్నారు. 317 జీవోతో వేలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ స్వస్థలాలకు దూరంగా సుదూర ప్రాంతాలకు బదిలీ అయ్యారని, వారికి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఆర్ శ్రీనివాస్, కట్ట రవీంద్రాచారి, రాష్ట్ర ఆర్థిక కార్య దర్శి డాక్టర్ ఆట సదయ్య, రాష్ట్ర బాధ్యులు పిస్నింటి తిరుపతిరావు, శనిగరపు రవి, సాన కిషన్, కందుకూరి దయానంద్, దాసరి శ్రీదర్, వెలిచాల వెంకటస్వామి, కొట్టె లక్ష్మణ్‌రావు, సీనియర్ నాయకులు మహాదేవుని నారాయణస్వామి, గుండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని సుడా చైర్మన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని శాతవాహన యూనివర్సిటీ ఎదుట, నాకా చౌరస్తా వద్ద ప్రజాపాలన విజయోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన వచ్చి ఏడాది అవుతున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలతో మమేకమై ఈ సంబరాల్లో పాల్గొ నడం అభినందనీయమ న్నారు. ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని, ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీ దన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ చేసిన పాపాలను కడుగుతూ ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రజాపాలనను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ తాజ్, కొరివి అరుణ్‌కుమార్, సమద్ నవాబ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, డివిజన్ల బాధ్యులు అస్తపురం రమేష్, మల్లికార్జున్, తిరుమల, రజితరెడ్డి, కమ్రొద్దిన్, షేక్ షహేన్‌షా పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

వేదాల్లోనే శాస్త్రీయ జ్ఞానం ఉంది..

- చొప్పదండి శాసన సభ్యుడు మేడిపల్లి సత్యం

భగత్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మన వేదాల్లోనే శాస్త్రీయ జ్ఞానం ఉందని చొప్పదండి శాసన సభ్యుడు మేడిపల్లి సత్యం అన్నారు. కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహిస్తున్న బాలల జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్ర మంలో ఆయన మాట్లాడుతూ సైన్స్ రోజు రోజుకు అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అం దు బాటులోకి వచ్చిందని తెలిపారు. విద్యార్థులు కొత్త విషయాలు తెలుసు కునేందుకు ఆసక్తి చూపాలన్నారు. అద నపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లా డుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్ర స్థాయి ఎంపికైన విద్యా ర్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్ర మంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఈవో జనార్దన్‌రావు, చాడ జయపాల్‌రెడ్డి, డీసీఈబీ సెక్రెటరీ మారం స్వదేశీకుమార్, సెయింట్ జార్జ్ పాఠశాల చైర్మన్ డాక్టర్ పాతిమారెడ్డి, మహ్మద్ అజీం, మిల్కూరి శ్రీనివాస్, గాజుల రవీందర్, నంది శ్రీనివాస్, కేఎస్ అనంతాచార్య పాల్గొన్నారు.



వైజ్ఞానిక సదస్సులో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మైత్రి ట్రాన్స్‌క్లినిక్‌ను వినియోగించుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

-భగత్‌నగర్, ఆంధ్రజ్యోతి

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ

-సుభాష్‌నగర్, ఆంధ్రజ్యోతి

8

ఉపాధిహామీ పనులపై అవగాహన కల్పించాలి

- డీఆర్‌డీఓ శ్రీధర్

- కరీంనగర్ రూరల్, ఆంధ్రజ్యోతి

జిల్లా అభివృద్ధి కోసం పోరాడుతాం

- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

భగత్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర అభివృద్ధికోసం పోరాటాలు ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. సోమవారం కోతిరాంపూర్‌లోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో సీపీఎం మహాసభల్లో ఆమోదించిన తీర్మాణాలను విలేకరుల సమా వేశంలో వెల్లడించారు. సమావేశంలో 22 తీర్మాణాలు చేశా మన్నారు. తీర్మాణాల అమలు కోసం పోరాటాలు నిర్వహిస్తా మన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గీట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, జి భీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు యు శ్రీనివాస్, ఎస్ సంపత్, కోనేటి నాగమణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



రాష్ట్ర పోటీలకు ఎంపికైన జట్టుతో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కబడ్డీ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి సత్తా చాటాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ ఇ ప్రసాదరావు, అధ్యక్షుడు డాక్టర్ అమిత్‌రావు పిలుపునిచ్చారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారిణులకు సోమవారం సాయంత్రం అంబేద్కర్ స్టేడియం ఆవరణలోని శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా క్రీడాకారిణులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ కూరుస్తామని అన్నారు. జిల్లా మహిళల జట్టుకు కోచ్‌గా పద్మ, మేనేజర్‌గా మోహన్ వ్యవహరిస్తున్నట్లు కబడ్డీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ సంపత్‌రావు తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ సంఘం వైస్ ఛైర్మన్ అనూకర్‌రావు, ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడ్, నిర్వహణ కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి సీనియర్స్ బేస్‌బాల్ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో 4న జిల్లాస్థాయి సీనియర్స్ పురుషుల, మహిళల జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు బేస్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చల్ల హరిశంకర్, ఎండీ యూనిస్ పాషా ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు మధ్యాహ్నం 2 గంటలకు అంబేద్కర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని, వివరాలకు 9866834675 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికా రులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరి యంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మంలో దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన దర ఖాస్తుల్లో కరీంనగర్ మున్సిపల్ కార్పొ రేషన్-24, కరీంనగర్ ఆర్‌డీవో-22, హుజురా బాద్ ఆర్‌డీవో-15, కరీంనగర్ రూరల్ తహసీ ల్దార్-17, జిల్లా పంచాయతీ అధికారి-15, ఇతర శాఖలకు సంబంధించినవి-166 దరఖాస్తులు ఉన్నాయి. వారి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజాదర్బార్ లాగిన్‌లో ఉన్న అన్ని అర్జీలను పరిష్కరించాలన్నారు. ఇప్పటి వరకు వచ్చిన పిటిషన్లు, పరిష్కరించిన వాటి వివరాలకు సంబంధించిన కాపీలను బుధవారం కార్యాలయానికి తీసుకు రావాలని నాయబ్ తహసీల్దా ర్లకు సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్ పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

హెచ్‌ఐవీపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణకు వైద్య సిబ్బంది ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ పమేలాసత్పతి అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించు కుని జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వ ర్యంలో చేపట్టిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ ప్రజల్లో అనేక అపో హలు ఉన్నాయని, ప్రజల్లో విస్తృత అవగా హన కల్పించాలని సూచించారు. వ్యాధి సోకిన వారు ధైర్యంగా ఉంటూ క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. అనంతరం డీఎంహె చ్‌వో ఆధ్వర్యంలో ఫిల్మ్‌భవన్‌లో ఎయిడ్స్, కుష్టు కేసుల గుర్తింపు పక్షోత్స వాలపై సద స్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని తెలిపారు. అదనపు డీఎంహెచ్ వో డాక్టర్ సుధ మాట్లా డుతూ హెచ్‌ఐవీపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయా లని సూచించారు. అనంతరం విశిష్ట సేవలందించిన ఐసీటీసీ కౌన్సిల ర్లకు ప్రశంసా పత్రాలను అందచేశారు. ఎయిడ్స్‌పై కాలేజీ విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులను అంద చేశారు. కార్యక్రమంలో డీటీసీవో డాక్టర్ రవీందర్‌రెడ్డి, ఎయిడ్స్ ప్రోగ్రామ్ అధికారి సురేందర్‌రెడ్డి, పీవోఎం హెచ్‌ఎన్ డాక్టర్ సనా జువేరియా, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎన మల్ల నరేశ్, కార్యదర్శి డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి

సుభాష్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ప్రారంభించినట్లు జిల్లా సంక్షేమ అధికారి సబితకుమారి తెలిపారు. జిల్లా స్థాయి దివ్యాంగుల సమావేశంలో కలెక్టర్ ఆదేశాలమేరకు ప్రారంభించామన్నారు. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు దివ్యాంగులకు ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తామన్నారు. సోమవారం నాలుగు దరఖాస్తులు వచ్చాయని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

● కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా అగ్నిప్రమాదం

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు చీర కొంగుకు మంటలు అంటుకొని గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు పరిస్థితి విషమించి మృతి చెందింది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌కు చెందిన వట్టెల మల్లవ్వ(75) ఓ చిన్న గదిలో ఉంటోంది. ఈ నెల 1న రోజులాగే కింద కూర్చొని కట్టెల పొయ్యిపై వంట చేస్తోంది. ప్రమాదవశాత్తు చీర కొంగు అంటుకొని మంటలు ఒక్కసారిగా ఎగిసి పడ్డాయి. దీంతో వృద్ధురాలు కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు చేరుకుని మంటలను ఆర్పి వేశారు. అప్పటికే ఆమె తీవ్ర గాయాలపాలైంది. వెంటనే సిరిసిల్లలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మల్లవ్వకు ఇద్దరు కొడుకులు ఉండగా చిన్న కొడుకు రెండేళ్ల కిందట మృతి చెందాడు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలో తాళం వేసి ఉన్న లిక్కిడి పద్మ, నర్సింహారెడ్డి ఇళ్లలో ఆదివారం చోరీ జరిగింది. ఎస్సై రమాకాంత్ సోమవారం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. పద్మ తన పిల్లలతో కలిసి ఇంటికి తాళం వేసి వీర్నపల్లి మండలం కంచర్లలోని పుట్టింటికి వెళ్లింది. సోమవారం వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగులకొట్టి కనిపించాయి. బీరువాను ధ్వంసం చేసి రూ.15 వేల నగదు ఎత్తుకెళ్లారు. అదే గ్రామంలోని ఉచ్చిడి కిషన్ రెడ్డి ఇంటి తాళం పగులకొట్టిన దొంగలు లాప్‌టాప్, ట్యాబ్, గడియారం చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ వివరించారు.



మల్బరీ ఆకును కత్తిరిస్తున్న పరికరం (ఫైల్)

మల్బరీ రైతులకు ప్రత్యేక పరికరం

● తోటలో కొమ్మలు కత్తిరించి.. కట్టలు కట్టి ● కూలీల కొరత దూరం ● కొడుముంజ యువకుడి ప్రతిభ

తంగళ్లపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వృత్తి రీత్యా అతడు మోటారు వైండింగ్ మెకానిక్. వ్యవసాయ పనుల్లో రైతుల శారీరక శ్రమ, కూలీల కొరతతో ఎదురయ్యే ఇబ్బందులను గమనించే వాడు. రైతులకు ఉపయోగపడేందుకు పలు పరికరాలు రూపొందించాడు.

ఇందులో భాగంగా మల్బరీ తోటలో కొమ్మలు కత్తిరించి కట్టలు కట్టే పరికారాన్ని తయారు చేసి సెంట్రల్ సిల్క్ బోర్డు ప్రశంసలు అందుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం చిన్న లింగపూర్ గ్రామానికి చెందిన కొడు ముంజ ప్రవీణ్ మోటారు వైండింగ్‌లో ఏడాదిపాటు శిక్షణ పొందాడు. మొదట సైకిల్‌తో కలుపు తీసే యంత్రాన్ని, అనంతరం స్కూటర్ ఇంజన్‌తో కలుపు తీసే యంత్రాన్ని తయారు చేశాడు. పత్తి, కూర గాయలు సాగు చేసే రైతులకు అందుబాటులోకి తెచ్చి కూలీల కొరతను అధిగమించేలా చేశాడు.

అదే స్ఫూర్తితో మల్బరీ కొమ్మలు కత్తిరించి కట్టలు కట్టే పరికరాన్ని రుపొందించాడు. పట్టు పురుగుల పెంపకం కోసం మల్బరీ మొక్కలను పెంచి కొమ్మలను కత్తిరించి వాటిని షెడ్‌లో పెరిగే పట్టు పరుగులకు ఆహారంగా వేస్తారు. ఈ ప్రక్రియలో 15 మంది కూలీలు ఒక్క రోజు చేసే పనిని పరికరం నలుగురు కూలీలతో గంటలో చేయగలదు. సమయం ఆదా అవ్వడంతోపాటు ఖర్చు కూడా తగ్గుతుంది. తక్కువ కూలీలతో ఏ రోజు కత్తిరించిన ఆకులను ఆ రోజు పట్టు పురుగులకు వేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తుండడంతో పరికరం వైపు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

కేంద్ర పట్టు మండలితో ఒప్పందం

భారత ప్రభుత్వం కేంద్ర పట్టు మండలితో రైతులకు 50 శాతం సబ్సిడీతో పరికరం అందివ్వడానికి ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పరికరానికి సుమారు రూ.2.20 లక్షలు ఖర్చవుతుంది. కేంద్ర పట్టు మండలి ఒప్పందంతో రైతులకు 50 శాతం సబ్సిడీ అందిస్తుండడంతో రూ.1.10 లక్షలకు లభిస్తోంది. సుమారు 20 పరికరాలను తయారు చేసి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని రైతులకు అందించాడు.



పత్తి, మల్బరీ రైతులకు ఉపయోగం

కొడిముంజ ప్రవీణ్, మిషన్‌రూప కర్త, జిల్లెల్ల

మల్బరీ కొమ్మలు కత్తిరించే మిషన్ మల్బరీ రైతులతో పాటు పత్తి రైతులకు ఉపయోగపడుతుంది.. పత్తి ఏరడం పూర్తయిన తర్వాత పత్తి కట్టె కొట్టడానికి, పశుగ్రాసం కోయడానికి ఉపయోగపడుతుంది. మిషన్ తయారీపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ప్రవీణ్ తయారు చేసిన పరికరం



పరికరాన్ని పరిశీలిస్తున్న కేంద్ర పట్టు మండలి ప్రతినిధులు(ఫైల్)

మధు మృతదేహం కోసం ఎదురుచూపు

పాలకుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదివారం తెల్లవారుజామున ములుగు జిల్లా ఏటూరునాగారం చల్పాక అటవీ ప్రాంతంలో జరిగిన పోలీస్ ఎదురు కాల్పుల్లో మృతి చెందిన వేగోలపు మల్లయ్య అలియాస్ మధు(47) మృతదేహం రాక కోసం కుటుంబసభ్యులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. సోమవారం ఉదయం మల్లయ్య కుటుంబసభ్యులు ఆయన మృతదేహన్ని గ్రామానికి తీసుకు రావడానికి ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. కానీ మల్లయ్య మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని తెలంగాణ పౌర హక్కుల సంఘం నేతలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మల్లయ్య మృతదేహన్ని సిట్టింగ్ జడ్జి సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించాలని కోరారు. మృతదేహన్ని గ్రామానికి తీసుకు రావడానికి కుటుంబసభ్యులకు తోడుగా వెళ్తున్న ఏబీఎంఎస్ నాయకురాలు శాంతను ములుగు పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని పౌరహక్కుల సంఘం నేతలు తీవ్రంగా ఖండించారు.

సివిల్ సప్లయీస్ అధికారుల దాడులు

● ఆరు టన్నుల బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాన్‌ను పట్టుకున్న అధికారులు

కోల్‌సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణాను ఉపేక్షించవద్దని, విస్తృత దాడులు నిర్వహించాలని సివిల్ సప్లై కమిషనర్ డీఎస్ చౌహాన్ ఆదేశాలతో పౌర సరఫరాల యంత్రాంగం అప్రమత్తమైంది. రేషన్ బియ్యం అక్రమ రవాణా కేంద్రాలపై దృష్టి పెట్టింది. రేషన్ దందాకు డెన్‌గా మారిన గోదావరిఖనిలో సోమవారం సాయంత్రం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గోదావరిఖని రాజేష్ థియేటర్ వద్ద రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యాన్ టీఎస్22టీ8897ను పట్టుకున్నారు. వ్యాన్‌ను సీజ్ చేసి 30క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనపర్చుకున్నారు. వ్యాన్‌ను గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాత్రి 9గంటలకు మార్కండేయకాలనీలోని రేషన్ స్మగ్లర్‌కు చెందిన డంప్‌పై సివిల్‌సప్లై అధికారులు దాడులు చేశారు. రామస్వామి అనే వ్యక్తి ఇంట్లో రేషన్‌బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో ఈ దాడులు చేశారు. మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దాడుల్లో డీటీసీఎస్‌లు మహేష్, రవీందర్ పాల్గొన్నారు.

తండ్రీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన తండ్రి కుతురుల పురుగుల మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన తండ్రి కుతురు మల్లవేని నారాయణ(55), శిరీష(22)లు తన ఇంట్లో పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. బంధువులు గమనించి అపస్మారక స్థితిలో ఉన్న వారిని ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. నారాయణ భార్య చాలా సంవత్సరాల క్రితం మృతి చెందింది. వ్యవసాయం చేస్తూ ఒక్కగానొక్క కుతురు శిరీషను పోషిస్తున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ద్విచక్ర వాహనాలు ఢీ : ముగ్గురికి గాయాలు

బీర్‌పూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలో రోడ్డు పక్కన నిలిపిన ద్విచక్రవాహనానికి వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీ కొని ముగ్గురు యువకులు సోమవారం తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి ఇందిరానగర్ వెళ్లే మార్గంలో ఇందిరానగర్‌కు చెందిన ముగ్గురు యువకులు ఒకే వాహనంపై వెలుతున్నారు. గ్రామ శివారు ప్రాంతంలో నర్సింహులపల్లికి చెందిన మంద సుభాష్ రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాన్ని ఆపుకొని ఫోన్ మాట్లాడుతుండగా వెనుక నుంచి వచ్చిన ముగ్గురు యువకులు సుభాష్ వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో ఇందిరానగర్‌కు చెందిన ఇద్దరి యువకులకు, నర్సింహులపల్లికి చెందిన సుభాష్‌కు తీవ్ర గాయాలు కావడంతో జగిత్యా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాలు దగ్ధం

● అనుమానితుడిని అరెస్టు చేసిన పోలీసులు



దగ్ధం అవుతున్న వాహనాలు

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూరు డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయం వద్ద ఆదివారం అర్ధరాత్రి నాలుగు ద్విచక్ర వాహనాలు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దూరు డబుల్ బెడ్ రూం ఇళ్లలోని బ్లాక్ నెంబర్ 33 వద్ద అంకం సందీప్‌కు చెందిన హీరో గ్లామర్, ముత్యాల రాజుకు చెందిన హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్, చీరాల ఈశ్వరయ్యకు చెందిన హోండా, మైలారం రామయ్యకు చెందిన టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనాలు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని దుండగులు వాహనాలకు నిప్పటించారని బాధితులు ఆరోపించారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు పెద్దూరుకు చెందిన ఆకారపు బాలయ్య అనే వ్యక్తి సంఘటనకు పాల్పడినట్లు సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా గుర్తించి అరెస్టు చేశారు. పెట్రోల్ దొంగతనానికి వచ్చిన బాలయ్య వాహనాల్లో పెట్రోల్ ఎక్కువ లభించలేదని ఆగ్రహంతో దగ్ధం చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు

భీమారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో భీమారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన పుప్పాల రచన, చిలువేరి రుచితలు ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ జూనియర్స్ అండర్-19 క్రీడా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈవో మధుసూదన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జవ్వాజి అశోక్, పీఈటీ తిరుమలేశ్, మాజీ సర్పంచ్ చెక్కపెల్లి అరుణరఘు, మాజీ ఎంపీటీసీ పల్లి అర్జున్, ఏపీ చైర్మన్ డిండిగల లావణ్య, మాజీ ఉప సర్పంచ్ బసవరాజుల రాజు ఉపాధ్యాయులు అభినందించారు.

అదనపు ఆదాయ మార్గం.. పెరటి కోళ్ల పెంపకం

● ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళల ఆర్థికాభివృద్ధికి పోత్సాహం



హరిదాస్‌నగర్‌లో కోడి పిల్లల షెడ్



బండిలింగంపెల్లిలో పెరటికోళ్లతో లక్ష్మి

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరా మహిళాశక్తి పథకం మహిళలకు వరంగా మారింది. ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన గ్రామైక్య సంఘం మహిళలు పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం పొందుతున్నారు. ఒక్కో మహిళకు రూ.5,500 బ్యాంకు రుణం అందిస్తోంది. ఆసక్తి ఉన్న మహిళలకు కోడి పిల్లలను అందించి పెంచేలా చర్యలు తీసుకున్నారు. ఆయా గ్రామాల్లోని మహిళలు కోడి పిల్లలను పెంచుతూ ఉపాధి పొందుతున్నారు. కోడి పిల్లలు ఆరు మాసాల్లో కిలో నుంచి కిలోన్నర బరువు పెరుగుతాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పెరటి కోళ్లకు మంచి డిమాండ్ ఉండడంతో కిలోకు రూ.450 నుంచి రూ.500 వరకు ధర పలుకుతోంది. కిలోన్నర కోడి రూ.700లకు విక్రయిస్తే 50 కోళ్లకు రూ.35 వేల వరకు ఆదాయం వస్తోంది. పెట్టుబడి పోను రూ 25 వేల వరకు మిగులుతాయి.

53 మందికి 800 కోడి పిల్లల అందజేత

మండలంలోని పలు గ్రామాలకు చెందిన గ్రామైక్య సంఘం మహిళలను పెరటిలో కోడి పిల్లలను పెంచేలా అధికారులు ప్రోత్సహించారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద రుణం మంజూరు చేసి ఒక్కో మహిళకు 15 నుంచి 20 వరకు 800 కోడి పిల్లలను ఆరు నెలల కిందట అందించారు. పెరటి ఆవరణలో మహిళలు పెంచుతున్న కోళ్ల కిలో నుంచి కిలోన్నర బరువు వరకు పెరిగాయి. పలువురు మహిళలు కోళ్లను విక్రయించారు.

కోడి పిల్లల పెంపకంతో ఉపాధి

- తిప్పరవేణి ప్రేమలత, హరిదాస్‌నగర్,



హరిదాస్‌నగర్‌లోని శివాజీ గ్రామైక్య సంఘంలో సభ్యురాలిగా కొనసాగుతున్నా. రూ. 2 లక్షల బ్యాంక్ రుణం తీసుకుని ఇంటి ఆవరణలో చిన్న పాటి షెడ్డును ఏర్పాటు చేశా. సిద్దిపేట, కామారెడ్డి పట్టణాలను నుంచి ఒక్కో కోడి పిల్లను రూ.34 చొప్పున 800 కోడి పిల్లలను తీసుకొచ్చి షెడ్డులో ఆరు వారాల పాటు పెంచాను. సార్లు గ్రామాల్లోని మహిళలకు ఒక్కో కోడి పిల్లను రూ.100లకు విక్రయించేలా చూశారు. ఆరు వారాలకు సుమారు రూ.80 వేల వరకు ఆదాయం సమకూరుతోంది.

పెట్టుబడి పోనూ రూ.6 వేలు వస్తాయి

- మాచర్ల లక్ష్మి, బండలింగంపల్లి



బండలింగంపల్లి గ్రామంలోని సంతోషిమాత గ్రామైక్య సంఘంలో గల భగవాన్ స్వయం సహాయక సంఘం సభ్యురాలిని. రూ 3 వేలు స్త్రీ రుణం పొంది 20 కోడి పిల్లలను తీసుకున్నా. మా పెరట్లో నాలుగు నెలల పాటు పెంచా. కిలో బరువు వరకు రాగానే విక్రయిస్తున్నా. పెట్టుబడి పోనూ రూ 6 వేలు మిగులుతాయి.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

సుల్తానాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా పోలీసులు బాధితురాలికి అందజేశారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం వేగురుపల్లి గ్రామానికి చెందిన రేణుక అనే మహిళ సుల్తానాబాద్ శివారులోని శాస్త్రినగర్ వద్ద గల సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల హాస్టల్‌లో ఉంటున్న తన కూతురును చూడటానికి సోమవారం వచ్చింది. కూతురిని చూసి తిరిగి వెలుతున్న క్రమంలో ఆమె సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. వెంటనే గమనించిన మహిళ 100కు డయల్ చేసి ఫిర్యాదు చేసింది. సుల్తానాబాద్ బ్లూ కోల్ట్స్‌కు చెందిన పోలీసులు రాకేష్, హరీష్ సెల్‌ఫోన్ కోసం ప్రయత్నం చేసి కనిపెట్టారు. దాన్ని తీసుకుని స్టేషన్‌లో అప్పగించగా ఏఎస్ఐ హన్మంతరావు బాధితురాలికి అందజేశారు.



పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను మహిళకు అందజేస్తున్న పోలీసులు

ఆలయంలో చోరీ

కోరుట్ల , డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆయోధ్య పట్టణ అంజనేయ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఆలయ హుండీ పగులగొటిన గుర్తు తెలియని వ్యక్తులు దాదాపుగా 20 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ మృతి

కోల్‌సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ద్వారకానగర్‌లో నివాసముండే దొంగరి బాలకృష్ణ(38) అనే యువకుడు మద్యానికి బానిసై గత నెల 30న ఇంటి ఆవరణలో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన్నట్లు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. స్థానికులు గమనించి గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతనికి భార్య, కూతురు ఉన్నారు. భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుళ్లకోట గ్రామంలో ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెల్గటూర్ ఎస్ఐ ఉమాసాగర్ కథనం మేరకు.. గుళ్లకోట గ్రామానికి చెందిన మామిడిపల్లి యాదగిరి (40) 15 ఏళ్లుగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా రోగం నయం కావడం లేదని జీవతంపై విరక్తితో ఆదివారం క్రిమి సంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు.

మృతుడి భార్య మామి డిపల్లి సుమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శిథిలమైన బొమ్మెన ప్రాజెక్ట్ కుడి కాలువ

బొమ్మెన ప్రాజెక్ట్ కాలువల ఆధునీకరణ ఎప్పుడో..?

● మత్తడి నుంచి వృథాగా పోతున్న నీరు
● చివరి ఆయకట్టు సాగు ప్రశ్నార్థకం
● రూ. 1.65 కోట్లతో ప్రతిపాదనలు

కథలాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా ఎదురు చూస్తున్నా బొమ్మెన ప్రాజెక్ట్ కాలువ ఆధునీకరణకు మోక్షం లభించడం లేదు. ఈ ప్రాజెక్ట్ కింద దాదాపు 1500 ఎకరాల ఆయకట్టు సాగవుతుండగా కాలువలు ధ్వంసం కావడంతో చివరి ఆయకట్టుకు నీర ప్రశ్నార్థకంగా మారింది. సుమారు 25 ఏళ్ల కిందట అప్పటి మెట్‌పల్లి ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు చొరవతో ప్రాజెక్ట్‌కు మోక్షం లభించింది. ఈ ప్రాజెక్ట్‌ను స్థానికులు గడ్డపార చెరువుగా పిలుస్తుంటారు. ఇప్పటికి ప్రభుత్వాలు మారినా కాలువల పరిస్థితి మాత్రం అధ్వాన స్థితిలోనే ఉన్నాయి.

రూ.1.65 కోట్లతో ప్రతిపాదనలు

దూలూరు, దుంపెట, బొమ్మెన గ్రామాల రైతులకు వరప్రదాయినిగా ఉన్న ఈ ప్రాజెక్ట్‌కు ఏటా పుష్కలంగా నీరు వచ్చి చేరుతోంది. తుర్తి, గంభీర్‌పూర్, తాండ్ర్యాల, పోతారం, ఇప్పపల్లి అడవుల్లోంచి వరద ఉధృతి వచ్చి చేరుతుంది. కుడి, ఎడమ కాలువల్లో చెట్లు పెరిగి ఆయకట్టుకు నీరందని దుస్థితి దాపురించింది. కూలి పోయి కాలువలు పూర్తిగా ధ్వంసం కావడం వల్ల చివరి దాకా నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. తూము పూర్తిగా దెబ్బతినడంతో ఏ క్షణాన కూలిపోతుందో తెలియని పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఇరిగేషన్ అధికారులు సుమారు రూ. 6 కోట్లతో ప్రతిపాదనలు పంపినా మోక్షం లభించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతానికి అత్యవసరమైన పనులకే అంచనాలు రూపొందించాలని పేర్కొనడంతో రూ. 1.65 కోట్లతో అంచనాలు తయారు చేసి సర్కారుకు నివేదించారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇరిగేషన్ ఈఎన్‌సీతో చర్చలు జరిపినట్టు సమాచారం. ఈ నిధుల విడుదల కోసం రైతాంగం ఎదురుచూస్తోంది.

కాలువల్లో సిమెంట్ లైనింగ్ నిర్మించాలి

కొన్రెడ్డి జలంధర్‌రెడ్డి, రైతు బొమ్మెన



నా పొలం చివరి ఆయకట్టులో ఉండడంతో నీరు అందడం లేదు. వానలు అధికంగా కురిసిన సమయంలో కాలువలు దెబ్బతింటున్నాయి. కోతకు గురవుతుండడం వల్ల నీరు వృథాగా పోతోంది. ఆ సమయంలో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉంది. పూర్తిగా కాలువల్లో సిమెంట్ లైనింగ్ నిర్మిస్తే మేలు జరుగుతుంది. అధికారులు దృష్టి సారించాలి.

మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి


సుధాకర్‌రెడ్డి

గణేశ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. కరీంనగర్‌లోని చైతన్యపురిలో సోమవారం ఉమ్మడి జిల్లా మానవ హక్కుల వేదిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య, రాష్ట్ర బాధ్యులు టి.హరికృష్ణలు హాజరై ఉమ్మడి జిల్లా కమిటీని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా పందిళ్ల రంజిత్, జిల్లా ఉపాధ్యక్షులుగా అజయ్ కుమార్, రమేష్‌లు, సహాయ కార్యదర్శులుగా సంపత్ కుమార్, అచ్యుత్‌లు ఎన్నికయ్యారు.

భూ వివాదంలో ఘర్షణ

చందుర్తి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో అన్నదమ్ములు ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్న సంఘటన చందుర్తి మండలం కొత్తపేట గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపేటకు చెందిన పిట్టల శంకర్, పిట్టల లక్ష్మణ్ అనే అన్నదమ్ముల మధ్య దారి విషయంలో గొడవ తలెత్తింది. దీంతో ఇరువురు కర్రలతో దాడి చేసుకోవడంతో శంకర్‌కు తలకు గాయం కాగా, లక్ష్మణ్‌కు చేతికి గాయమైంది. శంకర్‌ను కరీంనగర్‌కు, లక్ష్మణ్‌ను వేములవాడలోని ఆస్పత్రికి తరలించినట్లు, ఈ సంఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించి మోసం చేశాడని ఓ యువతి కూనారంలోని ప్రియుడి ఇంటి ఎదుట సోమవారం బైఠాయించింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. కునారం గ్రామానికి చెందిన జంగిటి అనిల్ తనను ప్రేమిస్తున్నానని నమ్మించి మోసం చేశాడని తనకు న్యాయం చేయాలని యువతి అనిల్ ఇంటి ఎదుట బైఠాయించింది.




చెట్ల మధ్య ఏర్పాటు చేస్తున్న మార్గం, వై జంక్షన్ సమీపంలో ఏర్పాటు చేసిన గజేబో, పార్కుల్లో ఏర్పాటు చేయనున్న బెంచీలు

ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

- రూ.కోటితో కొండగట్టు అర్బన్ పార్క్
- కొండపైన 440 హెక్టార్లలో ఏర్పాటుకు చర్యలు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు
- కొండపైన ఆలయ పరిసరాలు, అటవీ ప్రాంతం వీక్షించేలా ఏర్పాట్లు

మల్యాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదం కల్పించడానికి కొండపైన అర్బన్ పార్కు ఏర్పాటు కానుంది. అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.కోటితో చేపట్టనున్న పనులు త్వరలోనే ప్రారంభానికి ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొండగట్టు గుట్టల్లో దేవస్థానం భూములతో పాటు అటవీశాఖకు వందలాది ఎకరాల్లో భూములున్నాయి.

కొండగట్టు అంజన్న దర్శనానికి నిత్యం వేలాదిగా, హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా లక్షలాదిగా భక్తులు వస్తుంటారు. దీంతో వారికి కొండపై మరింత ఆహ్లాదం అందించడానికి కొండపైన ఆలయ పరిసరాలు, అటవీ ప్రాంతం వీక్షించేలా కార్యాచరణ చేపట్టారు. ఇందులో భాగంగా రూ.కోటి వ్యయంతో పలు ప్రతిపాదనలు రుపొందించారు. దాదాపు 440 హెక్టార్లలో కొండగట్టు అర్బన్ పార్కు ఏర్పాటుకు నిర్ణయించారు. ఇందులో వైజంక్షన్ ప్రాంతం నుంచి చేపట్టే పనుల్లో భాగంగా గజేబో (సేద తీరేందుకు కూర్చునేది) నిర్మించారు. త్వరలోనే పార్కు ఏర్పాటు చేసే భూమి చుట్టూ ఫెన్సింగ్ గోడలతో పాటు ప్రవేశ ద్వారం లోపల వాచ్ టవర్, సుమారు 4కి.మీ మేర నడిచివెళ్లే మార్గం తదితరవి ఏర్పాటు కానున్నాయి. వైజంక్షన్ నుంచి దేవస్థానం ప్రధాన కార్యాలయం వెనుకాల నుంచి తాగునీటి బావి, బొజ్జపోతన ప్రాంతం నుంచి వాకర్‌ట్రాక్ ఏర్పాటు చేయనున్నారు. త్వరలోనే వీటికి టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నారు.

భక్తులకు భక్తితో పాటు ఆహ్లాదం

మొయినుద్దీన్, ఎఫ్‌ఆర్‌వో, కొడిమ్యాల

కొండపైకి వచ్చే భక్తులకు ఆహ్లాదం పంచడానికి పార్కు ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇప్పటికే కొన్ని పనులు ప్రారంభించాము. టెండర్లు ఇతరత్రా పూర్తి కాగానే పనులు చురుగ్గా చేపట్టే అవకాశం ఉంది. దేవస్థానం పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఈ పార్కు భక్తులకు ఎంతగానో ఆకట్టుకోనుంది. ఇప్పటికే ఏర్పాటు చేసిన గజేబో ఆకట్టుకుంటోంది.


కొండపై వీక్షించడానికి ఏర్పాటు చేయనున్న వాచ్‌టవర్ నమూనా

పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు

- కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

గోదావరిఖని, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమి లేదని, ప్రజలను దోచుకొని దాచుకున్నారని రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ ఆరోపించారు. సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఇస్తే బీఆర్ఎస్‌ను విలీనం చేస్తానని సోనియాగాంధీ కాళ్లు మొక్కిన కేసీఆర్ ఎన్నికల సమయంలో మోసం చేశారన్నారు. పది సంవత్సరాలు పాలించిన కేసీఆర్‌ను ప్రజలు గద్దె దించారన్నారు. కేసీఆర్ సింగరేణి కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, కొత్త బొగ్గు గనుల తవ్వకాలు, క్వార్టర్ల నిర్మాణం, సింగరేణి కార్మికులకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందిస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు. కోల్‌బెల్ట్‌లో పది నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను సింగరేణి కార్మికులు గెలిపించుకున్నారని చెప్పారు. 28రాష్ట్రాల్లో లేని విధంగా స్కీములను పెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని, ఆరుగ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో అనేక మంది యువకులు ప్రాణాలు బలిదానం చేశారని, వారికి ఎలాంటి భరోసా కేసీఆర్ ఇవ్వలేదన్నారు. ఏడాదిలో 50వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఈ నెల 4న పెద్దపల్లిలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా తొమ్మిది వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు నర్సింహారెడ్డి, ధర్మపురి, వంగ లక్ష్మిపతి, సదానందం, వికాస్ కుమార్, వడ్డేపల్లి దాస్, పోచం, సమ్మయ్య పుట్ట రమేష్ పాల్గొన్నారు.

5నుంచి దళిత హక్కుల ఉద్యమ జాతీయ మహాసభలు

లైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5 నుంచి చేపట్టనున్న దళిత హక్కుల ఉద్యమ రెండో జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజారత్నం పిలుపునిచ్చారు. సోమవారం కాలనీలో జరిగిన కార్యక్రమంలో మహాసభల పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య వచ్చి 77 ఏళ్ళు గడుస్తున్నా సమన్యాయం చేయడంలో ప్రభుత్వాలు విఫలమైనట్టు రాజారత్నం పేర్కొన్నారు. జనవరి 5 నుంచి 7 వరకు హైద్రాబాద్‌లో జాతీయ మహాసభ జరగనుందని తెలిపారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న దళిత సంఘాల నాయకులు మహాసభలకు తరలిరావాలని రాజారత్నం పిలుపునిచ్చారు.


అన్నదాతల్లో తుఫాన్ ఆందోళన

- మండలంలో కురిసిన చిరు జల్లులు
- ధాన్యం కుప్పలపై కవర్లు కప్పడానికి పరుగులు


వెల్గటూర్‌లో ధాన్యం కుప్పలపై కప్పిన కవర్లు

వెల్గటూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం రూపంలో చేతికి వచ్చిన పంట ఎక్కడ తుడిచి పెట్టుకొని పోతుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రతీ ఏడాది అకాల వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తుండగా ఈసారి కోతల సమయంలో అకాల వర్షాలు లేక పోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ పంట చేతికి వచ్చి అమ్ముదామని సిద్ధం అవుతున్న వేళ తుఫాన్ రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. రెండు, మూడు రోజులుగా ఆకాశం మేఘావృతం కావడంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. సోమవారం మండలంలో చిరు జల్లులు పడడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ధాన్యం తడువకుండా ఉండేందుకు టార్పాలిన్ కవర్లు కప్పడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పరుగులు తీశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ ప్రభావంతో అక్కడక్కడా చిరు జల్లులు కురిసిన నేపథ్యంలో రైతులు పండించిన ధాన్యాన్ని కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు.

కల్వచర్ల రైతుకు మిలియనీర్ అవార్డు


మిలియనీర్ అవార్డు అందుకుంటున్న వేముల వెంకటేశ్వర్లు

రామగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన వేముల వెంకటేశ్వర్లు ఆదర్శ రైతు బిరుదుతో పాటు మిలియనీర్ అవార్డు సోమవారం ఢిల్లీలో అందుకున్నారు. రాష్ట్రంలో 12 మంది ఎంపికయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ముగ్గురు ఎంపిక కాగా అందులో పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుకు మిలియనీర్ అవార్డు అందుకున్నారు. జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ, జాతీయ వ్యవసాయ మాసపత్రిక కృషి జాగరణ సంయుక్తంగా దేశ రాజధాని ఢిల్లీలో వ్యవసాయంపై ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విభిన్న పంటలు 18 ఎకరాల్లో సాగు చేసినందుకు గాను వెంకటేశ్వర్లుకు మిలియనీర్ అవార్డుకు అందుకున్నారు. జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ అధికారుల చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. వెంకటేశ్వర్లును గ్రామస్థులు అభినందించారు.

ఎయిడ్స్‌పై అవగాహనా ర్యాలీ


జమ్మికుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జమ్మికుంట, డిసెంబర్ 02 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మొలుగు చందన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. హెచ్ఐవి మన శరీరంలో రోగ నిరోధక శక్తిని తగ్గిస్తుందని, అసురక్షిత శృంగారం, కలుషిత రక్తం ఎక్కించడం, కలుషిత సిరంజీలు, సూదులు వాడటం వల్ల వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేష్‌కుమార్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చితికిన పాల వ్యాపారులు

డెయిరీల వైపే మొగ్గు చూపుతున్న పాడి రైతులు

హుజూరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు గ్రామాల్లో ఉదయం నాలుగు గంటలకే పాల వ్యాపారులు మోటర్ సైకిళ్లపై హారన్ మోగిస్తూ రైతుల వద్దకు వచ్చి పాలు తీసుకునేవారు. నేడు అక్కడక్కడ మాత్రమే ఈ వ్యాపారులు కనబడుతున్నారు. డెయిరీలు రావడంతో పాల వ్యాపారుల బతుకులు చితికిపోయాయి. ఏళ్లుగా పాల వ్యాపారంలో ఉన్న వారు ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ప్రతి ఇంటికి రెండు ఆవులు, రెండు గేదెలు ఉండేవి. వీటిని రైతులు తమ పంట పొలాల వద్దకు మేతకు తీసుకెళ్లి మేపుతుండేవారు. ఆవు, గేదెల పాలను రాత్రి, ఉదయం పితికి వ్యాపారులకు పోసేవారు. వారు ఆ పాలను పట్టణాలకు తీసుకువచ్చి హోటళ్లు, ఇళ్లలో, హాస్టళ్లలో పోసేవారు.

ఈ క్రమంలో డెయిరీలు ఏర్పడ్డాయి. పాల వ్యాపారులు ఇచ్చే దర కంటే డెయిరీ వారు ఎక్కువగా ఇవ్వడంతో పాటు బోనస్ అందించేవారు. దీంతో రైతులు డెయిరీ వైపు మొగ్గు చూపారు. రైతులు కూడా ఆవులు, గేదెలను కొంత మంది మాత్రమే సాకుతున్నారు. వీరు డెయిరీలోనే పాలు పోస్తుండడంతో పాల వ్యాపారులు తగ్గిపోయారు. చివరికి హోటళ్ల నిర్వాహకులు పాల ప్యాకెట్లు తీసుకునే పరిస్థితి నెలకొనడంతో చాలా మంది పాల వ్యాపారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

డెయిరీల వల్ల ఉపాధి కోల్పోయాం..

మహేందర్, పాల వ్యాపారి, కనుకులగిద్దె



డెయిరీలు రావడంతో మా ఉపాధి దెబ్బతింది. గతంలో గ్రామాలకు తెల్లవారు జామున వెళ్లి రైతుల వద్ద నుంచి పాలు తెచ్చుకునేవాళ్లం. రైతులకు నెల రాగానే డబ్బులు ఇచ్చేవాళ్ల. ఇప్పుడు రైతులు పాలు పోయడం లేదు. కొనేవారు లేకుండా పోయారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.



హుజూరాబాద్‌లో ఇంటింటికి తిరుగుతూ పాలు విక్రయిస్తున్న వ్యాపారులు

వైద్య విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్
- రామగుండంలో నర్సింగ్ కళాశాల ప్రారంభం

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం నూతనంగా రూ.26కోట్లతో మంజూరు చేసిన నర్సింగ్ కాలేజీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నానని చెప్పారు. అమ్మ జన్మనిస్తే వైద్యులు పునర్‌జన్మనిస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో కష్టపడి చదివిస్తున్నారని, వారి కష్టాన్ని వృధా చేయకుండా విద్యార్థులు శ్రద్ధగా చదివి ప్రపంచస్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో అందరూ భయపడి ఇంట్లో ఉంటే వైద్య సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఎందరో ప్రాణాలను కాపాడారని, దేశ, ప్రపంచంలోని జనాలకు భరోసా ఇచ్చారన్నారు. రామగుండం మెడికల్ కళాశాలలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేశామన్నారు. రామగుండం మెడికల్ కళాశాలలో పీజీ విద్యతో పాటు డెంటల్ కాలేజీ ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడానని ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. నర్సింగ్ కళాశాల బిల్డింగ్ నిర్మాణానికి ఈ నెల 4న సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. మెడికల్ కళాశాల నుంచి జనరల్ ఆసుపత్రికి రాజీవ్ రహదారిపై స్కైవేను త్వరలోనే ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

- ట్రాన్స్‌జెండర్ క్లినిక్ ప్రారంభం

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేక క్లినిక్‌లను ఏర్పాటు చేయగా గోదావరిఖని ప్రభుత్వజనరల్ ఆసుపత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రారంభించారు. ట్రాన్స్‌జెండర్లు వైద్యం కోసం మైత్రి క్లినిక్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ బంగి అనిల్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, కాంగ్రెస్ కార్పొరేటర్ మహంకాళి స్వామి, ఆర్ఎంవోలు పాల్గొన్నారు.

సైబర్ ఉచ్చులో ఆర్ఎంపీ

చందుర్తి డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన ఓ ఆర్ఎంపీ సైబర్ ఉచ్చులో పడ్డాడు. బాధితుడు కరీం కథనం ప్రకారం.. సోమవారం గుర్తు తెలియని ఓ వ్యక్తి సిబిఐ పోలీసులమంటూ ఫోన్ చేశాడు. మీ ఆధార్ కార్డుపై ముంబైలో ఫోన్ నెంబర్ తీసుకొని బ్లాక్ మనీ చలామణి చేస్తున్నారని బెదిరింపులకు పాల్పడ్డాడు. తాను ముంబైకి రాలేదు నాకు ఎలాంటి సంబంధం లేదని కరీం తెలిపాడు. తాము సీబీఐ పోలీసులం అంటూ మీ ఫోన్ నెంబర్ వాడుతున్న వ్యక్తి జైల్లో ఉన్నాడని, అతడే నీ పేరు చెప్పాడని బెదిరింపులకు పాల్పడ్డాడు. నీకు ఎన్ని బ్యాంక్ ఖాతాలు ఉన్నాయో చెప్పాలని మీ బ్యాంక్ అకౌంట్ రిజర్వ్ బ్యాంక్ ద్వారా వెరిఫై చేయాలని అకౌంట్ నెంబర్లకు డబ్బులు వేయాలని చెప్పారు. దీంతో ఆర్ఎంపీ వైద్యుడు తన ఖాతాలో నుంచి మోసగాళ్లు చెప్పిన అకౌంట్ నెంబర్లకు డబ్బులు పంపాడు. తాను మోసపోయానని గ్రహించిన ఆర్ఎంపీ కరీం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భక్తులతో కిటకిటలాడిన రాజన్న ఆలయం


వేములవాడలో ఆలయం వద్ద భక్తుల రద్దీ


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. శీఘ్రదర్శనం, ధర్మదర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకొని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్న ఆలయానికి తగ్గిన ఆదాయం

- కార్తీక మాసంలో రూ.6 కోట్ల 83 లక్షలు
- గతేడాదితో పోలిస్తే రూ. కోటి 56 లక్షలు తక్కువ

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ కార్తీక మాసం ఆదాయం గతేడాది కంటే ఈ సారి భారీగా తగ్గింది. కార్తీక మాసం 1 నవంబరు 2024 నుంచి 30 నవంబరు 2024 వరకు ఆయా అర్జిత సేవల ద్వారా రూ.6 కోట్ల 83 లక్షల 58 వేల 172 సమకూరింది. గతేడాది కార్తీక మాసం 14 నవంబరు 2023 నుంచి 12 డిసెంబరు 2023 నెలకు రూ. 8 కోట్ల 39 లక్షల 97 వేల 807 ఆదాయం సమకూరింది. దీంతో గత సవంత్సరం కార్తీక మాసం కంటే ఈ సంవత్సరం రూ.కోటి 56 లక్షల 39 వేల 635 తగ్గింది.

దుబ్బమల్లికార్జునస్వామి జాతర


ఆలయంలో పెద్దపట్నం, హాజరైన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 02 (ఆంధ్రజ్యోతి): శ్రీదుబ్బ మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సోమవారం మున్సిపల్ పరిధిలోని శ్రీదుబ్బమల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలకు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఒగ్గు పూజారులు పూర్ణకుంబ స్వాగతం పలికారు. పెద్దపట్నం, కళ్యాణం వేడుకను తిలకించారు. భక్తులతో కాసేపు ముచ్చటించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లిఖార్జునస్వామి ఆశీస్సులతో హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. మూడు నెలల పాటు జరిగే జాతర ఉత్సవాలను ఘణంగా జరుపాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్ మేడిపల్లి రవిందర్, పోడేటి రామస్వామి, పోల్నేని సత్యనారాయణ, పర్లపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

సుభాష్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, సీఎం రేవంత్‌రెడ్డి గద్దె దిగాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట బీజేపీ ఆధ్వ ర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అడ్డగోలు హామీలు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుగ్గిలపు రమేశ్, కొట్టె మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యం వాసుదేవరెడ్డి, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్, కార్పొరేటర్లు కొలగాని శ్రీనివాస్, పెద్దపల్లి జితేందర్, బండ రమణారెడ్డి, శ్రీనివాస్, కన్నబోయిన ఓదెలు, సోమిడి వేణు, జానపట్ల స్వామి, బల్వీందర్‌సింగ్, మామిడి చైతన్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ

● హుజూరాబాద్: బీజేపీ ఆధ్వర్యంలో హుజూరాబాద్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి సంపత్‌రావు, కరుణాకర్, పుప్పాల రఘు, నర్సింహరాజు, తూర్పాటి రాజు, పైళ్ల వెంకట్‌రెడ్డి, నల్ల సుమన్, అశోక్‌రెడ్డి, ఆదిరెడ్డి, అశోక్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● మానకొండూరు: మండలంలోని గట్టుదుద్దెనపల్లి, చెంజర్ల, మానకొండూరు గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు అమలయ్యేంత వరకు ఉద్యమాలు చేపడ తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్య క్షులు గుర్రాల వెంకట్‌రెడ్డి, కరివేద మహిపాల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధులు అలివేలు సమ్మిరెడ్డి, బొంతల కళ్యాణి చంద్ర, మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ పాల్గొన్నారు.

● శంకరపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కొత్తగట్టు గ్రామం నుంచి బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాడ వెంకట్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సమ్మిరెడ్డి, కల్యాణ్‌చంద్ర, కొంరయ్య, ఏనుగుల అనిల్, ప్రవీణ్, శంకర్, రాజు, నరేందర్, ప్రభాకర్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, మోహన్, లక్ష్మణ్, శ్రావణ్‌రెడ్డి, సాగర్, సారయ్య, ప్రదీప్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ లావణ్య తెలిపారు. ఇండస్ట్రియల్ ఫీడర్, పద్మనగర్, ఇండస్ట్రియల్ ఏరియా, సాయిబాబా టెంపుల్ ఏరియా, విజేత అపార్ట్‌మెంట్ ఏరియా, మార్కండేయ నగర్, ప్రగతినగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

'పేదలకు సేవ చేయడమే లక్ష్యం'

భగత్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చేయడం, అభాగ్యులను ఆదుకోవడమే హీరా ఫౌండేషన్ లక్ష్యమని ఆ సంస్థ మేనేజింగ్ ట్రస్టీ ముఫ్తీ మహ్మద్ షియాస్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం కొత్తపల్లి మండలంలోని చింతకుంట శాంతినగర్‌లో హీరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 250 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకతీతంగా భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటి చెప్పడమే లక్ష్యమన్నారు.

ఈ కార్యక్రమంలో చింతకుంట మాజీ ఎంపీటీసీ బానోతు తిరుపతినాయక్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానోతు శ్రవణ్‌నాయక్, హఫీజ్ రిజ్వాన్, ఫలాహి, డాక్టర్ అబ్దుల్ ఖుద్దూస్, అహ్మద్‌జైది, హీరా ఫౌండేషన్ ప్రతినిధులు మహ్మద్ రఫి, హఫీజ్ అహ్మద్ హిఫ్జి, కలీం శరీం,ముఖరం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీజీవో కార్యవర్గం

సుభాష్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ నూతన కార్యవర్గం సోమవారం కలెక్టర్ పమేలాసత్పతిని, పోలీసు కమిషనర్ అభిషేక్ మొహంతిలను మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, కార్యదర్శి అరవింద్‌రెడ్డి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, టీజీవోలు ట్రెజరీ డీడీ నాగరాజు, లైబ్రేరియన్ రామ్మోహన్, వెంకటేశ్వరరావు, రామచంద్రారెడ్డి, రాజేశ్వరి, గడ్డం సుధాకర్, లక్ష్మీనర్సింహరావు, రోహిత్, వీణ, మమత, అభినయ్‌రెడ్డి, రాజు, కొండల్‌రెడ్డి, చంద్రకళ, రాజశేఖర్‌రెడ్డి, రాజశేఖర్, జోయల్, రాకేశ్, హమీద్‌షా, శ్రీనివాస్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై అవగాహన కల్పించాలి

కరీంనగర్ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఉపాధిహామీ పనులపై అవగాహన కల్పించాలని డీఆర్‌డీవో శ్రీధర్ మండల అధికారులకు సూచించారు. మంగళవారం కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈజీఎస్ పనులపై కరీంనగర్ రూరల్, చొప్పదండి, కొత్తపల్లి మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి జాతరలో భాగంగా ఇటీవల ప్రారంభించిన పనులను మార్చి 31 వరకు పూర్తి చేయాలని సూచించారు. పొలంగట్లపై మొక్కల పెంపకంతో పాటు, పశువుల షెడ్లు, కోళ్ళ ఫారంలు, బావుల పూడికతీత వంటి పనులను చేపట్టేందుకు రైతుల నుంచి దరఖాస్తులను తీసుకోవాలన్నారు. గ్రామాల్లో మంజూరైన నర్సరీ పనులు పూర్తి చేయాలని తెలిపారు. జాబ్ కార్డులేని వారికి అందించే విధంగా చర్యలు చేపట్టాలని డీఆర్‌డీవో శ్రీధర్ అన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ పీడీ కిషన్, ఎంపీడీవో సంజీవరావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, ప్లాంటేషన్ మేనేజర్ సత్యనారాయణ, ఎవిఓ వెంకటేశ్వరరెడ్డి, ఎస్‌యంబి కోఆర్డినేటర్ రమేష్, సీనియర్ అసిస్టెంట్ పద్మ రెడ్డి, ఏపీఓ శోభరాణి, ఈసీఎస్‌లు, టీఎస్‌లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం

కరీంనగర్ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సోమవారం జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాలలో విద్యార్థినిలు పోస్టర్ కాంపిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలో జంతుశాస్త్రం, ససూక్ష్మ జీవ శాస్త్రం, జాతీయ సేవా సంస్థ, కంప్యూటర్ సైన్స్ విభాగం వారు పలు కార్యక్రమాలు నిర్వహించారు. జంతు శాస్త్ర విభాగాధిపతి ఎం కళ్యాణి, ఇమ్రాన్ శహెవార్, సంధ్యారాణిలు విద్యార్థినిలకు కాలుష్య నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూక్ష్మ జీవ శాస్త్రం విభాగాధిపతి, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ కె గీతా రాణి, ప్రవిత, కళాశాల వైద్యాధికారి చైతన్య పాల్గొన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగా ధిపతి ఎస్ పద్మజ ఆధ్వర్యంలో ప్రపంచ డిజిటల్ లిటరసీడే సందర్భంగా డాక్టర్ వెంక టేశ్వర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ వాగేశ్వరి అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్ టి మాలతి, వైస్ ప్రిన్సిపల్ సమత పాల్గొన్నారు.

మైత్రి ట్రాన్స్‌క్లినిక్‌ను వినియోగించుకోవాలి

-కలెక్టర్ పమేలా సత్పతి



మైత్రి ట్రాన్స్‌క్లినిక్‌ను ప్రారంభించిన అనంతరం ట్రాన్స్‌జెండర్లతో కలెక్టర్ పమేలాసత్పతి

భగత్‌నగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రధాన ఆసుపత్రిలో మైత్రి ట్రాన్స్‌క్లినిక్‌ను ట్రాన్స్‌జెండర్లు వినియోగించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సోమవారం జిల్లా ప్రధాన ఆసుపత్రిలో మైత్రి ట్రాన్స్‌క్లినిక్, కొత్తపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో పారామెడికల్ నర్సింగ్ కళాశాలలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల కోసం ఏర్పాటు చేసిన మైత్రి క్లినిక్‌లో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, జిల్లా సంక్షేమాధికారి సబిత, ఆర్ఎంఓ నవీన, సఖి అడ్మిన్ లక్ష్మి పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కోచింగ్'

కరీంనగర్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల సమన్వయంతో విద్యార్థులకు పలు పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఈమేరకు పాఠశాలల యజమానులతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యాజమానులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించేందుకు ప్రైవేటు పాఠశాలల యజమానులు చేయూతనివ్వాలని గతంలో కోరామన్నారు. దీంతో పలు ప్రైవేటు సంస్థల యజమానులు ముందుకు వచ్చి ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకోవడం అభినందనీయమన్నారు. పారమిత విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టెడ్ ఎడ్ కోచింగ్ ఇప్పటికే ప్రారంభమైందని తెలిపారు. అల్ఫోర్స్, సెయింట్‌జార్జ్, వివేకానంద, సాధన, నందిని వంటి విద్యాసంస్థలు ఐఐటి, ఒలంపియాడ్, మోరల్ ఎడ్యుకేషన్ టిఎస్‌ఆర్‌జెసి వంటి పోటీపరీక్షలకు ప్రభుత్వ విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇచ్చేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఎంఓయు ప్రకారం వారికి శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, జిల్లా కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): లండన్‌లో ఉంటున్న పలువురు కాంగ్రెస్ నాయకులు ఎన్నారై బీఆర్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కుర్మాచలం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. లండన్‌లో ఉంటున్న కరీంనగర్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు సాయికిరణ్‌రావు, వివిధ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు నర్సింగారావు, పవన్‌కల్యాణ్, భరత్‌రావు, హర్షవర్ధన్‌రెడ్డి, సంజయ్‌రెడ్డి, సందీప్ దొగ్గల తదితరులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా సాయికిరణ్‌రావు మాట్లాడుతూ తాను ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పని చేశానన్నారు. తెలంగాణలో సంవత్సర కాలంగా జరిగిన విధ్వంసం చూసి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎన్నారై బీఆర్‌ఎస్ యూకె అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, కార్యవర్గసభ్యులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

పీఆర్సీ సిఫార్సులు అమలు చేయడం హర్షణీయం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు మరణిస్తే ఇస్తున్న అంత్యక్రియల ఖర్చులను రూ.20వేల నుంచి రూ.30 వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని తెలంగాణ స్టేట్ మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్ అన్నారు. మొదటి పే రివిజన్ కమిషన్ సిఫార్సుల మేరకు ఈ ఉత్తర్వులను గత ప్రభుత్వం పదేళ్ల అయినా జారీ చేయలేదని అన్నారు. అంత్యక్రియల చార్జీలు పెంచడం పట్ల అసోసియేషన్ పక్షాన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

'టెట్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్'

కరీంనగర్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వీఎస్‌ఆర్ క్లాసెస్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న టెట్ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ తరగతులను నిర్వహిస్తామని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో టెట్ శిక్షణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉచితంగా అల్ఫోర్స్ ఈ క్లాస్ యాప్‌ను అందజేశామని, ఇప్పటికే 50000 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్నారని ఆయన చెప్పారు.

బయోమైనింగ్ చేయాలని కాంట్రాక్టర్‌కు నోటీసు

-ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

కరీంనగర్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డంపింగ్‌యార్డు చెత్తను గడువులోగా బయోమైనింగ్ చేయాలంటూ కాంట్రాక్టు సంస్థ మెస్సర్స్ హర్షిత ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు నోటీసు జారీ చేసినట్లు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 'చెత్త సమస్య'కు మోక్షమెప్పుడో శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు ఇంజనీరింగ్ అధికారులు స్పందిస్తూ బయోమైనింగ్ కాంట్రాక్టు సంస్థకు నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంపై నిషేధాజ్ఞలు కొనసాగింపు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

● డీజేలపై నిషేధాజ్ఞలు పొడిగింపు

కమిషనరేట్ పరిధిలో డీజే సౌండ్ల వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలుగకుండా శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్లతో కూడిన డిజె సౌండ్ల వినియోగంపై నిషేధాజ్ఞలు విధించామన్నారు.

● డ్రోన్‌ల వినియోగంపై నిషేధాజ్ఞలు

కమిషనరేట్ పరిధిలో భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్టుల వినియోగాన్ని నిషేధించామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు ఈ నెల 31వ తేది వరకు అమలుల్లో ఉంటాయని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఐపీసీ సెక్షన్ 188 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

● శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి సోమదారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నియమనిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

సంబంధిత ఏసీపీల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించకూడదన్నారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 31వ తేదీ వరకు అమల్లో ఉంటాయన్నారు.

యాసంగి సాగుకు రైతులు సన్నద్ధం

కరీంనగర్ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో యాసంగి సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. దుక్కులు దున్నడం వంటి పనుల్లో నిమగ్నం అయ్యారు. కరీంనగర్ మండలంలో మొత్తం 16,190 ఎకరాల్లో పంటకు సాగు యోగ్యమైన భూమి ఉంది. మండలంలో 13,550 ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. వరి పంట 12,600 ఎకరాలకు పైగా సాగు చేస్తారని అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రభుత్వం క్వింటాలుకు 500 బోనస్ చెల్లిస్తుండడంతో సన్న రకం వరి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయి. పంటల సాగులో యూరియా 924 మెట్రిక్ టన్నులు, డీఏపీ 678 టన్నులు, ఎంవోపీ 339 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 1,016మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అధికారులు అంచనావేస్తున్నారు. సరిపడా ఎరువులను రైతులకు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.సత్యం తెలిపారు.



వరి నాటుకు సిద్ధమైన భూమి

బీఆర్‌ఎస్‌వీ గురుకులాల సందర్శన



జమ్మికుంటలో విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆరెస్వీ నాయకులు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం జిల్లా కో ఆర్డినేటర్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ నియోజకవర్గంలోని 10 గురుకులాలు, కేజీబీవీ మోడల్ స్కూల్స్‌ను సందర్శించారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వి నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్, అను బంధ సంఘాల నాయకులు మొగిలి గణేశ్, ఏదుల జితేందర్, శనిగరపు సతీష్, గుర్రం మహేందర్, సోహెల్, పరుశరాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● హుజూరాబాద్ : హుజూరాబాద్ పరిధిలోని బోర్నపల్లిలో నిర్వహిస్తున్న సైదాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సోమవారం బీఆర్‌ఎస్వీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనం, వసతులు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లోని వంట గది, సామాగ్రి, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్లను పరిశీలించారు.

● శంకరపట్నం: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను బీఆర్‌ఎస్వీ గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా జిల్లా ఇన్‌చార్జీ ఆవాల హరిబాబు సందర్శించడానికి వెళ్లగా, అనుమతి లేదని ప్రిన్సిపాల్ గేటు వద్దనే నిలిపివేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ విద్యా వ్యవస్థ పదేళ్ల వెనుకకు నెట్టివేయబడ్డదని ఆవేదన వ్యక్తం చేశారు.

● జమ్మికుంట రూరల్ : జమ్మికుంట పట్టణంలో గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా కస్తూర్బా, మైనార్టీ బాలికలు, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలను బీఆర్‌ఎస్వీ పట్టణ అధ్యక్షులు కొమ్ము నరేష్ ఆధ్వర్యంలో సోమ వారం సందర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పొనగంటి శ్రీలత ఉన్నారు.

టెడ్-ఎడ్ కార్యక్రమానికి జంగపల్లి పాఠశాల ఎంపిక



పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులను అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్/గన్నేరువరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండలం జంగపల్లి జడ్పీహెచ్‌ఎస్ టెడ్-ఎడ్ (టెక్నాలజీ ఎంటర్‌టైన్‌మెంట్ డిజైన్ ఎడ్యుకేషన్) లైసెన్స్ పొందినందుకు పాఠశాల ఉపాధ్యాయులు వసుంధర, శ్రీనివాస్, హెచ్‌ఎం శారదలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. కలెక్టర్ సోమవారం తన కార్యాలయానికి పిలిపించి అభినందించారు. అదనపు సమూహానికి శిక్షణ ఇవ్వడానికి ఆంగ్ల భాషా ఉపాధ్యాయుల సంఘం (ఎల్టా) జడ్పీహెచ్‌ఎస్ జంగపల్లితో కలిసి పనిచేస్తుందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఎల్టా బృందాలతో త్వరలో మరో సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి అశోక్‌రెడ్డి, ఎల్టా స్టేట్ జనరల్ సెక్రటరీ వినయధర్‌రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత సాధ్యమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం గంగాధర మండలం కొండయ్యపల్లి మా ఊరి మహాలక్ష్మీ ట్రస్ట్ ఫౌండర్ రేండ్ల శ్రీనివాస్ పద్మ ఆధ్వర్యంలో గ్రామంలో ఆడపిల్ల పుడితే ఐదువేల ఫిక్స్‌డ్ డిపాజిట్ 10 మంది ఆడపిల్లల తల్లిదండ్రులకు అందించారు. ఈకార్యక్రమానికి హజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బాండ్లను అందించి మాట్లాడారు. ఫౌండేషన్ ద్వారా గత పది సంవత్సరాలుగా పిల్లలకు చేస్తున్న కార్యక్రమం జిల్లాలో స్ఫూర్తిగా నిలుస్తుందని వారిని అభినందించారు. గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తుమ్మల హరేందర్ కుటుంబానికి 10వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మనోహర్, గంగాధర పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, ,నాయకులు జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, అట్ల రాజిరెడ్డి, సత్తు కనుకయ్య, బుచ్చయ్య, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

● తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికాలం పూర్తి చేసుకున్న సందర్భంగా పెద్దపల్లి జిల్లాలో నిర్వహిస్తున్న విజయోత్సవ సభకు వేలాదిగా తరలి వెళ్దామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం గంగాధర ప్రజాకార్యాలయంలో గంగాధర మండల కాంగ్రెస్ కార్యకర్తలతో సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలే నినాదంగా సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 4న పెద్దపల్లిలో విజయోత్సవ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త బాధ్యతతో తరలి వచ్చి సీఎం సభను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మనోహర్, బాక్ కాంగ్రెస్ మహిళ సంధ్య, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, నాయకులు జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, సత్తు కనుకయ్య పాల్గొన్నారు.



డిపాజిట్ బాండ్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అందాలి : సీపీఐ

గన్నేరువరం, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా చేస్తానన్న 2 లక్షల రుణమాఫీని అర్హులైన ప్రతి రైతుకూ అందించాలని సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు నాయకులు మాట్లాడారు. రుణమాఫీ ఏకకాలంలో జరుగక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి చొక్కల్ల శ్రీశైలం, కూన మల్లయ్య, బోయిని మల్లయ్య ఉన్నారు.

పశువైద్య శిబిరం

తిమ్మాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు పోరండ్ల ,మొగిలిపాలెం గ్రామాలలో పీవి నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ కోరుట్ల పశువైద్య కళాశాల, పశువైద్య పశు సంవర్ధక శాఖ జాతీయ సేవాపథంలో భాగంగా సోమవారం ప్రత్యేక పశువైద్య శిబిరాలు నిర్వహించారు. శిబిరంలో 95 జంతువులకు గర్భధారణ పరీక్షలు, గర్భాశయ వ్యాధుల చికిత్స, 270 సాదారణ కేసులు, ఆరు జంతువులకు శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. పాథాలజీ విభాగం డాక్టర్ వై.రవికుమార్ ఆధ్వర్యంలో బ్లడ్ స్మియర్ పరీక్షలు, రక్త సంబంధిత వ్యాధులు, ఇతర పరాన్న జీవుల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగాం అధికారులు డాక్టర్ సాకారం, డాక్టర్ జి.అంబిక, డాక్టర్ శ్రీనివాస్, పశు సంవర్ధక శాఖ వైద్యులు మోనికా, భారతి, సురేందర్ రెడ్డి, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలపై ముసుగు తొలగించాలి

తిమ్మాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రెండు సంవత్సరాల క్రితం నెలకొల్పిన అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలపై ఉన్న ముసుగు తొలిగించేందుకు ప్రభుత్వానికి నివేదించాలని డిమాండ్ చేస్తూ తిమ్మాపూర్ మండల జేఏసీ నాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్‌లు మాతంగి శంకర్, దుండ్ర రాజయ్య సుగుర్తి జగదీశ్వరాచారి, అఖిల్ పాషా, వంతడుపుల సంపత్, జలపతి పాల్గొన్నారు.

మల్లికార్జున స్వామి దేవాలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

● కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ ప్రణవ్‌బాబు

జమ్మికుంట, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారంలో గల శ్రీదుబ్బమల్లికార్జునస్వామి దేవాలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్‌బాబు అన్నారు. సోమవారం శ్రీదుబ్బమల్లిఖార్జునస్వామి జాతర ప్రారంభం సందర్భంగా పెద్దపట్నం, కళ్యాణంకు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల కమిటీలను నియమించి, అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఇల్లందకుంట దేవస్థానం చైర్మన్ దేశిని కోటి, కౌన్సిలర్ మేడిపల్లి రవీందర్ ఉన్నారు.

పోలీసుల సేవలను మరింత చేరువ చేయాలి

హుజూరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో పోలీస్ శాఖలో నూతనంగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు ఆహ్వాన, అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌జీ సబ్ డివిజన్ పరిధిలోని విధులను, బాధ్యతలపై నూతన కానిస్టేబుళ్లకు అవగాహన కల్పించారు. అనంతరం బదిలీపై వెళ్లిన పోలీసులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఐలు తిరుమల్‌గౌడ్, పులి వెంకట్‌గౌడ్, రవి, కిశోర్, ఎస్ఐలు రాజకుమార్, తిరుపతి, ఆరోగ్యం, రవి తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు బోధించాలి

హుజూరాబాద్ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త సిలబస్‌ను విద్యార్థులకు బోధించాలని మాజీ ఎమ్మెల్యే, కిట్స్ కళాశాల కార్యదర్శి వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని సింగాపూర్ కిట్స్ కళాశాలలో జావా ఫుల్ స్టాక్ విత్ రియాక్టు జెఎస్, ఏఐ ట్రైనింగ్ ప్రోగ్రాం కళాశాల డైరెక్టర్ శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక విజ్ఞానం అభ్యసించుటకు అధ్యాపకులకు అన్ని అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రవీంద్రబాబు, రఘు, ఓబులయ్య, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 02 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మారుతినగర్‌లో నివాసం ఉంటున్న నిరుపేద వృద్ధులు, వితంతువులకు సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ సునిల్‌కుమార్ సోమవారం దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నంది అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ కరస్పాండెంట్ సునిల్ కుమార్‌ను అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ కస్తూర్బా విద్యాలయంలో గెస్ట్ ఫ్యాకల్టి పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి భార్గవిఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటర్‌లో కెమిస్ట్రీ సబ్జెక్టు బోధించుటకు తగిన విద్యార్హతలు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, 23వేల వేతనం లభిస్తుందని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

హుజూరాబాద్ రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి గ్రామంలో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టూ పక్కల ఆరు గ్రామాల ప్రజలకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన జయన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుడిపాటి సరిత-జైపాల్‌రెడ్డిలకు మాజీ సర్పంచ్ కాసగోని నిరోషా-కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

మానకొండూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చునూరు గ్రామంలో సోమవారం అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొని అయ్యప్ప నామస్మరణ, భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు కొము రయ్య, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.